ఇబ్బందులు ఇంకెన్నాళ్లు?

- మరుగుదొడ్లు లేక మహిళల ఇక్కట్లు
- అమరచింత బస్టాండ్‌లో వసతులు కరువు

అమరచింత: మండల కేంద్రంలోని ఆర్‌టీసీ బస్టాండ్‌లో కనీస వసతులను కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. బస్సుల రాకపోకల సమాచారం కూడా నోటీసు బోర్డుపై లేకపోవడం, సమాచారాన్ని అందించే సిబ్బందిని నియమించకపోవడంతో ఆర్‌టీసీ బస్టాండ్ ప్రాంగణం సమస్యల వలయంలో నేటికీ కొట్టుమిట్టాడుతుంది. తాగడానికి తాగునీటి వసతిని కూడా ఏర్పాటుచేయక పోవడంతో ప్రయాణికులు సమీపంలో ఉన్న హోటళ్ల వద్ద తమ దాహార్తిని తీర్చుకునే పరిస్థితులు నెలకొన్నాయి. రెండేళ్ల క్రితం నిరుపయోగంగా బస్సులు రాకుండా నిర్మానుష్యంగా ఉన్న బస్టాండ్‌ను అన్ని విధాల అభివృద్ధి పరుస్తామంటూ ఆర్‌టీసీ అధికారులు ముందుకు వచ్చారు. గద్వాల డిపో బస్సులను మాత్రమే బస్టాండ్ వరకు కొనసాగించడంతో పాటు మరికల్, మహబూబ్‌నగర్‌కు వెళ్లే నారాయణపేట డిపో బస్సులు కూడా కొత్త బస్టాండ్‌కు వచ్చి వెళ్లే వసతిని కల్పించారు. దీంతో ప్రయాణికులు కొత్త బస్టాండ్‌కు వెళ్లి బస్సులో ప్రయాణం చేయడానికి అలవాటు పడ్డారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ ప్రాంగణంలో మరుగుదొడ్లు, మూత్రశాలలను ఉపయోగంలోకి తేవడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్లకు మరమ్మతులు చేయకుండా వదిలి పెట్టడంతో మహిళా ప్రయాణికులు పలు ఇబ్బందులు పడుతున్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ఆర్‌టీసీ, మున్సిపాలిటీ అధికారులు చొరవచూపి యుద్ధప్రాతిపదికన మరుగుదొడ్ల వ్యవస్థను పునరుద్ధరించాలని కోరుతున్నారు.


అమరచింత బస్టాండ్‌లో మరమ్మతుకు నోచుకోని మరుగుదొడ్డి, మూత్రశాల

క్లుప్తంగా

విద్యా వ్యవస్థలో మార్పునకు కృషి

పాన్‌గల్: విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు ధర్మ టీచర్స్ యూనియన్ (డీటీయూ) కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా కన్వీనర్ బండారు శ్రీనివాసులు అన్నారు. సోమవారం పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సంఘాన్ని పరిచయం చేస్తూ కరపత్రాలను ఆవిష్కరించారు. రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక హక్కుల రక్షణ కోసం, ఉపాధ్యాయుల సర్వీస్ మ్యాటర్‌కు సంబంధించిన జనరల్ హక్కుల సాధన కోసం సంఘం పనిచేస్తుందన్నారు. సమావేశంలో ఆదివెంకట్, భీముడు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలి



పాన్‌గల్: ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పక రావాలని మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ సబ్జెక్టుపై నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాలను పెంచేలా బోధన చేయాలన్నారు. సమావేశంలో ఎఫ్‌ఎల్‌ఎన్, న్యాస్ పరీక్షలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



మదనాపురం: మండలంలోని అజ్జకొల్లు పంచాయతీ జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం ఓపె ఎన్జీఓ ఆధ్వర్యంలో గ్రామస్తులు, విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సభ్యుడు శేఖర్ మాట్లాడుతూ నాలుగు రకాల కారణాలతో హెచ్‌ఐవీ సోకుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షాకీర్ హుస్సేన్, సత్యానారాయణ, కళావతి, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పాన్‌గల్: మండలంలోని కదిరెపాడులో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన లలిత కుటుంబాన్ని సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించి రూ. 5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్ నాయక్, నర్సింహానాయక్, పగిడాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం..



ఆత్మకూర్: వరద బాధితుల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రూ.36,590 సేకరించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యవర్ధన్ రెడ్డి అన్నారు. కలెక్టరు ఆదర్శ్‌సురభీ ఆదేశాల మేరకు విద్యార్థులు సేకరించిన మొత్తాన్ని సోమవారం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అంజయ్యకు అందించామన్నారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద మొత్తాన్ని సేకరించి వరద బాధితుల నిమిత్తం ప్రభుత్వానికి అందించడం అభినందనీయమని డీఐఓ కొనియాడారు.

4 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఆత్మకూర్: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని కేసులు నమోదు చేసినట్లు సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ తెలిపారు. సోమవారం మండలంలోని రేచింతల గ్రామ శివారులోని ఊకచెట్టువాగు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని సమాచారం అందడంతో దాడులు నిర్వహించి మూడు ట్రాక్టర్లను, అల్లీపురం నుంచి ఇసుకను తరలిస్తున్న మరో ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ల డ్రైవర్లు, ఓనర్లపై బీఎన్‌ఎస్, పీడీపీపీ, మైనింగ్ ఆక్ట్‌ల కింద కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

మహిళలపై దాడి: కేసు నమోదు

అమరచింత: మండలంలోని కిష్టంపల్లిలో ఇద్దరు మహిళలను పరుశపదజాలంతో దూషిస్తూ దాడి చేసిన ఘటనలో ఓ వ్యక్తిపై నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. రెండు రోజుల కిందట కిష్టంపల్లిలో గ్రామానికి చెందిన బోయ చంద్రప్ప అనే వ్యక్తి ఆదే గ్రామానికి చెందిన ప్రమీల, అంజమ్మపై దాడి చేసి గాయపరచడంతో పరుశపదజాలంతో దూషించారని తెలిపారు. ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించి చంద్రప్పపై కేసు నమోదు చేశామన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


పాన్‌గల్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు


అమరచింతలో..

పాన్‌గల్: కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బుసిరెడ్డిపల్లిలో లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక వర్గ హక్కులను విదేశీ పెట్టుబడిదారులకు కట్టబెట్టిందని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో రాజు, బాలకిష్టి, శాంతమ్మ, శారద, రాజు, లక్ష్మయ్య, కుర్మయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు బ్లాక్ డే నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా సహ కార్యదర్శి ఆర్‌ఎన్ రమేష్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రాగానే నాలుగు లేబర్ కోడ్‌లని అమలు చేయడానికి సిద్ధమైందని ధ్వజమెత్తారు. 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచుతూ కార్మికులతో పనిచేయించాలను కుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బుచ్చన్న, వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

'జిల్లాకేంద్రానికి బస్సులు నడిపించాలి'

చిన్నంబావి: వనపర్తి జిల్లా కేంద్రానికి పెబ్బేరు, చిన్నంబావి మీదుగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రాజేందర్‌గౌడ్ ఒక ప్రకటనలో కోరారు. ఆయన మాట్లాడుతూ చిన్నంబావి మండల ప్రజలు నిత్యం వందలాది మంది వివిధ పనుల నిమిత్తం, ఆస్పత్రులకు వెళ్తుండడంతో బస్సు సౌకర్యం లేని కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే పెబ్బేరు స్టాప్‌లో ఆగాల్సి వస్తుందని, దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు తక్షణమే స్పందించి ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపేలా చూడాలని కోరారు.

ఆపద సమయంలో పోలీసులను ఆశ్రయించాలి



వీపనగండ్ల: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే ధైర్యాన్ని ప్రదర్శించాలని ఎస్ఐ రాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. మహిళలతో దురుసుగా వ్యవహరించే వారిని చట్టపరంగా ఎదుర్కోవాలని, ఎలాంటి ఆపద సమయంలోనైనా పోలీసుల సహకారం తీసుకోవాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం బిచ్చన్న, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర హాస్టల్ ఏర్పాటుకు వినతి

కొత్తకోట: పట్టణ కేంద్రంలో ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహం మంజూరు చేయించాలంటూ స్థానిక నాయకులు సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలో అమరచింత, ఆత్మకూర్, మదనాపురం, కొత్తకోట, అడ్డాకుల మండలాలకు చెందిన ఎస్సీ విద్యార్థులు చదువుతున్నారని, ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహం లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కళాశాల విద్యార్థుల కోసం ఎస్సీ హాస్టల్‌ను మంజూరు చేయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌జే బోయేజ్, పి.కృష్ణారెడ్డి, మేస్త్రీ శ్రీను, సుభాష్, రాజు తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం


అభిలాష్‌తో కళాశాల అధ్యాపక బృందం

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మోజర్ల సమీపంలో గల కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న అభిలాష్ మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండలో జరిగిన టార్గెట్ బాల్ పోటీల్లో ప్రతిభ చాటాడు. మహబూబ్‌నగర్ జిల్లా జట్టుకు ఎంపికై తెలంగాణ రాష్ట్ర స్థాయి టార్గెట్ బాల్ 6వ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్‌షిప్ అండర్–17 బాలుర విభాగంలో పాల్గొని ద్వితీయ స్థానం సాధించినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థి అభిలాష్‌ను కళాశాల అధ్యాపక బృందం ఓఎస్‌ఏ డాక్టర్‌రాజశేఖర్, షహనాజ్, విద్య, గౌతమి, ఫిజికల్ డైరెక్టర్ మహేష్, తోటి విద్యార్థులు అభినందించారు.

చిత్రలేఖనం పోటీలో విద్యార్థుల ప్రతిభ



కొత్తకోట రూరల్: ముచ్చింతల్‌లోని త్రిదండి చిన్నజీయర్‌స్వామి ఆశ్రమంలో ప్రజ్ఞా వికాస్ వారి ఆధ్వర్యంలో ఈనెల 21న నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో తమ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించినట్లు కేపీఎస్ డైరెక్టర్ చంద్రహాసన్‌రెడ్డి తెలిపారు. వ్యాసరచన పోటీల్లో శ్రీహితరెడ్డి (10వ తరగతి) వనపర్తి జిల్లాలో ప్రథమ స్థానం సాధించగా, చిత్రలేఖనం పోటీల్లో నరుకుల శ్రీజ (9వ తరగతి) ద్వితీయ స్థానం సాధించి ప్రశంసా పత్రంతో పాటు నగదును అందుకున్నారు. తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చడం సంతోషంగా ఉందని పాఠశాల యాజమాన్యం ఆనందం వ్యక్తం చేశారు.

'ఇంటి స్థలం వివాదంలో న్యాయం చేయాలి'

ఖిల్లాఘనపురం: మండలంలోని మల్కిమియాన్‌పల్లిలో తన ఇంటి స్థలం విషయంలో న్యాయం చేయాలని గ్రామానికి చెందిన గుంటి రాములు సోమవారం తహసీల్దార్ పాండునాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రానికి చెందిన కొందరు కావాలని తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. గ్రామ శివారులోని సర్వే నెంబర్ 4లో మొత్తం 1.23 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. దానిలోని నక్క చిన్న బుచ్చన్న ఇంటిని 2006లో తాను కొనుగోలు చేసి, రెండేళ్ల క్రితం రేకుల షెడ్డు నిర్మించుకున్నానని వివరించారు. కానీ కొందరు తనపై కక్షగట్టి తాను ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్డును కూల్చి మహిళా సంఘం భవనం నిర్మాంచాలని ఫిర్యాదులు చేస్తున్నారని వాపోయారు. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు. అలాగే గ్రామంలోని సర్వే నెంబర్ 4 తో పాటుగా గ్రామ కంఠం సర్వే నెంబర్లను సర్వే చేస్తే ప్రభుత్వ భూమి బయటకు వస్తుందని ఆయన తహసీల్దార్‌కు వివరించారు.

పేదల సంక్షేమం బీజేపీతోనే సాధ్యం



వనపర్తి రూరల్: బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే అన్ని వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందుతాయని పెబ్బేరు పట్టణ అధ్యక్షుడు కంచె ఆంజనేయులు అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గౌని వేమారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని పట్టణంలో ఇంటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు, వ్యాపారస్తులకు వివరించారు. కార్యక్రమంలో రామకృష్ణ, సర్వేశ్వర్‌గౌడ్, వేణు, శివనారాయణ, అరుణ్, శివ బీజేపీ కార్యకర్తలు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

అమరచింత: పలు అభివృద్ధి పనుల్లో పాల్గొనేందుకు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంగళవారం అమరచింతకు వస్తున్నారని తహసీల్దార్ రమేష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం, ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా లబ్దిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందిస్తారని పేర్కొన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో మహాలక్ష్మి పథకం ప్రొసీడింగ్ పత్రాలు అందించి అమరచింతలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. ఆయా గ్రామాల మహిళలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కొనసాగుతున్న స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతహీ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆయా జీపీల్లో పారిశుద్ధ్య నివారణ, వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, ఇంకుడు గుంతల నిర్మాణం, తడి, పొడి చెత్త వేరు చేయడం, సేంద్రియ ఎరువుల తయారీ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో గ్రామ సభ నిర్వహించి గ్రామాభివృద్ధి, స్వచ్ఛ గ్రామాల తయారీలో ప్రజలు భాగస్వాములు కావాలని పంచాయతీ కార్యదర్శి కుర్మన్న సూచించారు. గ్రామాల్లో పంచాయితీ కార్యదర్శులు మినహా గ్రామ ప్రత్యేకాధికారులు ఎక్కడ కూడా కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా అధికారులు స్పందించి గ్రామ ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రోడ్ల మరమ్మతు చేయాలని ప్రజావాణిలో ఫిర్యాదు

పాన్‌గల్: మండలంలోని పలు గ్రామాల రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ధర్మసమాజ్ పార్టీ(డీఎస్పీ) ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకుడు అశోక్ మాట్లాడుతూ మండలంలోని కొత్తపేట, మాందాపూర్, రాయినిపల్లి, బుసిరెడ్డిపల్లి, శాగాపూర్, గోప్లాపూర్, కిష్టాపూర్, కిష్టాపూర్‌తండా మీదుగా రేమద్దుల వెళ్లే రోడ్లు అధ్వానంగా, గుంతలమయంగా మారి ప్రయాణానికి ఇబ్బందిగా మారినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా రోడ్లకు మరమ్మతులు చేపట్టి ఇబ్బందులను తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలరాం, లక్ష్మణ్, కుర్మయ్య, రాములు పాల్గొన్నారు.


జేసీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కోతుల బెడదపై..

మదనాపురం: మండలంలోని దుప్పల్లిలో కొంతకాలంగా కోతులతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆదేశానుసారం కలెక్టరేట్‌లో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఇళ్లలోకి చొరబడి కోతులు కరుస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనలో ఉన్నారని, కోతుల బారినుంచి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు మహాదేవన్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, ఖాజమైనోద్దీన్, గొల్ల మన్నెం, చుక్క మాసన్న, గోపాల్, ఖాజారాం, చీర్ల నాని తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జూపల్లి చిత్రపటానికి పాలాభిషేకం

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌లో కేఎల్ఐ డీ–8 కాల్వలో భూములు కోల్పోయిన రైతులకు భూ పరిహారం మంజూరు చేయించడంపై హర్షిస్తూ గ్రామ రైతులు సోమవారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లురవి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్ మాట్లాడారు. గ్రామానికి చెందిన 30 మంది రైతులకు చెందిన 13.14 ఎకరాల భూమి కేఎల్ఐ డీ–8 ఎంజే–6 కాల్వల తవ్వకంలో 2017 సంవత్సరంలో భూములు కోల్పోయారన్నారు. కార్యక్రమంలో గేరి లక్ష్మయ్య, పెద్దబాలరాజు, కొమ్ము లక్ష్మయ్య, ఆకునమోని నాగశేషి, రైతులు పాల్గొన్నారు.


మంత్రి జూపల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

పింఛన్ల చెల్లింపులో జాప్యంపై రాస్తారోకో

ఆత్మకూర్: ప్రభుత్వం ఇస్తున్న ఆసరా పింఛన్లు సకాలంలో ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ జిల్లానాయకులు లక్ష్మీనారాయణశెట్టి, మోషె, ఏఐవైఎఫ్ జిల్లాకార్యదర్శి కుతుబ్ అన్నారు. సోమవారం స్థానిక గాంధీచౌక్‌లో పింఛనర్లతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ప్రతి నెల 5వ తేదీ లోపు ఇవ్వాల్సిన పెన్షన్ డబ్బులు 23వ తేదీ దాటుతున్న ఇవ్వకపోవడంతో దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు రూ.నాలుగు వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సుమారు గంటపాటు రాస్తారోకో నిర్వహించడంతో రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడడంతో ఏఎస్ బీచుపల్లి ఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో రవి, వినేష్, రాములు, మణెమ్మ, పెన్షన్‌దారులు ఉన్నారు.


నిరసన కారులకు నచ్చచెబుతున్న ఏఎస్ఐ బీచుపల్లి

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొత్తకోట రూరల్: హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో ఈనెల 22న నిర్వహించిన 6వ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ తెలంగాణ చాంపియన్‌షిప్ 2024–25 పోటీల్లో కొత్తకోటలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచినట్టు ప్రిన్సిపాల్ కె.మాధవి తెలిపారు. రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో అండర్–17 విభాగంలో కె.నందిని (ఇంటర్ బైపీసీ, మొదటి సంవత్సరం), జి.లక్ష్మి (10వ తరగతి) ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి పాల్గొని మొదటి స్థానంలో నిలిచారన్నారు. శిక్షణ ఇచ్చిన పీడీ స్వప్న, పీఈటీ భారతి, విద్యార్థినులను కళాశాల అధ్యాపక బృందం అభినందించారు. ఇద్దరు విద్యార్థినుల్లో ఒకరికి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.


విద్యార్థినులతో ప్రిన్సిపాల్ మాధవి

బాధిత కుటుంబానికి పరామర్శ

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాలకు చెందిన స్వాతి, అశ్విత రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతిచెందారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, స్థానిక నాయకులతో కలిసి మృతులకు పూలమాల వేసి నివాళులర్పించారు. వారికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, రామచంద్రయ్య, కుమ్మరి గోవిందు, శివనారాయణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు బోరు మోటార్ల చోరీ: కేసు నమోదు

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో రెండు బోరు మోటార్ల చోరీపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎజ్జు మల్లయ్య, అన్నె నారాయణ అనే రైతులు కేఎల్ఐ కాల్వ నుంచి మోటార్ల ద్వారా నీటిని వాడుకుంటున్నారు. ఈనెల 21వ తేదీన పొలం దగ్గరికి వెళ్లి కేఎల్ఐ కాల్వలో ఉన్న మోటార్లు చూడగా కనిపించలేదు. చుట్టు పక్కల వెతికినా మోటార్ల ఆచూకీ దొరకకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీటి సుమారు రూ.35 వేల వరకు ఉంటుందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి గణపతి నిర్వాహకులకు సన్మానం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఆంజనేయ స్వామి దేవాలయం ఎదుట మట్టి గణపతిని ఏర్పాటు చేసిన నిర్వాహకులు బొగ్గులపల్లి రఘుపతి రెడ్డి, రాగుల రవీందర్‌రెడ్డిలను సోమవారం జ్ఞాన వికాస భారతి సేవా సంస్థ అధ్యక్షుడు బ్రహ్మాచారి సన్మానించారు. ప్రకృతి పర్యరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సురేందర్, నరేందర్, రాజు, మహేశాచారి, మల్లేష్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



రహదారి నిబంధనలు ఉల్లంఘించొద్దు

పెంట్లవెల్లి: రోడ్డు నియమ నిబంధనలు ఉల్లంఘించొద్దని ఎస్ఐ రామన్‌గౌడ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారు డ్రైవర్లు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష ఉంటుందన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పైప్‌లైన్ నిర్మాణంలో వాగ్వాదం

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో పైప్‌లైన్ నిర్మాణం చేపడుతుండగా కాంట్రాక్టర్, మున్సిపల్ సిబ్బంది మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పదో వార్డులో డ్రెయినేజీ నీరు వెళ్లడానికి ఇటీవల రూ.లక్ష పనులకు కౌన్సిల్ తీర్మానం చేసింది. పనులను పదో వార్డు కౌన్సిలర్ భర్త సోమవారం మొదలు పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ సిబ్బంది పనులు నిలిపేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కమిషనర్ పనులు ఆపాలని సూచించనట్లు తెలిపారు. దీంతో కాంట్రాక్టర్, మున్సిపల్ సిబ్బంది మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా పనులకు వర్క్ ఆర్డర్ ఇవ్వలేదన్నారు. ఇంజినీరింగ్ అధికారి సూచనతో, టెక్నికల్‌గా పనులు చేయాల్సి ఉంటుందని, ఏఈ లేకుండా పనులు చేపడుతున్నందున పనులు నిలిపేయాలని సూచించినట్లు కమిషనర్ తెలిపారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన

ధరూరు: పోక్సో చట్టంపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సుకూర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గార్లపాడులోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పోక్సో చట్టం, బాల్యవివాహ చట్టం, సైబర్ క్రైం, ఆన్‌లైన్ గేమ్స్ వల్ల కలిగే నష్టాలపై వివరించారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యులు మాట్లాడారు. పిల్లలపై జరిగే నేరాలపై అవగాహన కల్పించారు. బాగా చదివి ప్రయోజకులు కావాలన్నారు. బాల, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభాకర్, ప్రసూన, సుధాకర్, శ్వేత, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.